# ఆ రాత్రి

## పులిపాక శ్రీరామచంద్రమూర్తి

"వస్తాడంటావా ?" అన్నాడు చక్రవర్తి, భుజానికున్న ఎయిర్ బాగ్ సరిచేసుకుంటూ.

"అడిగి చూద్దాం. వస్తే వస్తాడు. లేకపోతే లెఫ్ట్ అండ్ రైట్" అన్నాడు భానుమూర్తి.

"లెట్స్‌ట్రై" అని గొణిగాడు జనార్దన్, వాటర్ బాటిల్ని కుడిచేతికి మార్చుకుంటూ. ముగ్గురూ రోడ్డు పక్కకి నడిచారు.

"గురూజీ. గురూజీ" ముందుకి వంగి చేత్తో తట్టాడు చక్రవర్తి. "ఊఁ" అనే మూలుగు వినిపించింది. మళ్ళీ పిలుస్తూ, మళ్ళీ తట్టాడు చక్రవర్తి.

"ఏఁవిటీ గొడవ ?" అంటూ లేచి కళ్ళు నులుముకున్నాడు ఆటో డ్రైవర్. నిలబడ్డ ముగ్గుర్నీ మూడు నిమిషాలసేపు చూసి జేబులో చెయ్యి పెట్టాడు.

చక్రవర్తి వెనక్కి తగ్గాడు– కత్తిలాంటిదేమైనా బైటకి వస్తుందేమోనని. జనార్దన్. భానుమూర్తి ఆసక్తిగా చూశారు.

జేబులోంచి బీడీకట. అగ్గిపెట్టె తీసి బీడీ ముట్టించాడు ఆటో డ్రైవర్. బీడీ కంపు ఆ ముగ్గురి దాకా వెళ్ళనిచ్చి అడిగాడు.

"సెకండ్ షో వదిలేశారా ?" పగటిపూటైతే ఆ వాక్యం చివర 'సార్' ఉండేది.

"వదిలేశారు" అన్నాడు చక్రవర్తి.

"అన్ని హాళ్ళూ వదిలేశారా ?"

"ఆఁ పౌరాణికాలతో సహా."

"టైమెంతైంది ?"

"ఒంటిగంట దాటింది."

"గురూగారూ; తమరు బి యస్. మధ్యలోనే మానేశారా? లేక ప్యాసై కూడా ప్రాక్టీస్ పెట్టలేదా?" అన్నాడు జనార్దన్.

"ఏం! అలా అడిగారు!" అన్నాడు గురూజీ నవ్వకుండా.

"ఏం లేదు. ఇన్ని ప్రశ్నలడుగుతుంటేనూ?"

అతనివైపు రెండుక్షణాలు చూసి. ముందు సీట్లోకి వెళ్ళాడు గురూజీ.

"ఎక్కడికి వెళ్ళాలి?"

"హైదరాబాద్ రోడ్డులో పదహారో కిలోమీటర్ రాయి దగ్గరికి" అన్నాడు చక్రవర్తి.

"ఇంత రాత్రిపూట అక్కడికెందుకు?"

"డెకాయిటీకి కాదు; అక్కడ ఇళ్ళుకూడా లేవు. మమ్మల్నక్కడ దింపేస్తే చాలు."

"చాలా ఖర్చవుతుంది" అన్నాడు గురూజీ పెద్దగా ఆవులించి.

"ఎంతైనా ఫరవాలేదు."

గురూజీ ఆటో స్టార్ట్‌చేసి, తల వెనక్కి తిప్పకుండా అడిగాడు.

"టైము పన్నెండు దాటింది గదా?"

"దాటి గంటపైనే అయింది."

"అయితే తారీఖు మారినట్టే" అని కొద్దిసేపు కళ్ళు మూసుకొని ఏదో గొణిగాడు.

గేర్ వేసి. ఓసారి వెనక్కి తిరిగి నవ్వాడు– గురూజీ. చక్రవర్తి ఎయిర్ బాగ్ కిందపెట్టాడు. భానుమూర్తి మాత్రం దాన్ని మోకాళ్ళమీద పెట్టుకు కూర్చున్నాడు. జనార్దన్ జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి. మిగతా ఇద్దరికీ ఇచ్చాడు. ఆను అగ్గిపుల్లలతో మూడు సిగరెట్లూ ముట్టించాడు. గాలి రివ్వురివ్వున వీస్తోంది.

"ఏఁవిటీ రోడన్నీ కళకళలాడుతున్నాయి?" అన్నాడు చక్రవర్తి బైటకిచూస్తూ.

"బేనర్లు చూశ్చేదా! మంత్రిగారు యాత్రకెళ్తార్ట. ప్రజలకంటె ట్రాఫిక్‌వాళ్ళే మహా హడావుడిపడిపోతున్నారు" అన్నాడు భానుమూర్తి.

"ప్రజలు గుర్తొచ్చినట్టున్నారు."

"ఇన్ని నెలల తర్వాత" అన్నాడు జనార్దన్ నవ్వుతూ.

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమీద ఆటో మంచి స్పీడ్‌లో జారిపోతోంది. ఇరవై నిమిషాల తర్వాత గురూజీ తల వెనక్కి తిప్పాడు.

"పదహారో కిలోమీటర్ రాయిదగ్గరకు వచ్చేశాం".

"దిగుతున్నాం" అన్నాడు భానుమూర్తి. ముగ్గురూ దిగారు. చక్రవర్తి జేబులోంచి రెండు వందలు తీసిచ్చాడు.

"ఇంకా ఆరున్నర ఇవ్వాలి."

"ఎలా?" అడిగాడు జనార్దన్ ముందుకొచ్చి.

"చెప్పొద్దు" అని మరో పది తీసిచ్చాడు భానుమూర్తి.

"చిల్లర లేదు. సారీ" అని చెప్పి ఆటో రివర్స్‌చేసి. విజిల్ వేసుకుంటూ వెళ్ళిపోయాడు గురూజీ.

ముగ్గురూ రోడ్డు మీద నిలబడిపోయారు. రోడ్డుకి కుడివైపున విశాలమైన తోట. మరోవైపు దూరంగా కదలకుండా నిలబడ్డ కొండ. ఆ రాత్రిపూట. నక్షత్రాల వెలుతురులో. ఊరికి దూరంగా, తాము ముగ్గురు. ఎదురుగా ఆ తోట. ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు.

ఎయిర్ బాగ్ కిందపెట్టి. అందులోంచి మూడు టార్చ్‌లు తీశాడు భానుమూర్తి.

"లెట్స్‌మూవ్" అన్నాడు జనార్దన్. చక్రవర్తి రోడ్డుమీదికి ఓ సారి దృష్టిసారించి బైల్దేరాడు.

రోడ్డు దిగి తోటలోకి అడుగుపెట్టారు. నిశ్శబ్దంగా. జాగ్రత్తగా నడవడం మొదలుపెట్టారు. కాళ్ళ కింద ఎండుటాకులు విరుగుతున్నాయి. ఆపకుండా కీచురాళ్ళు అరుస్తున్నాయి. చెట్టుకొమ్మమీంచి వాళ్ళ ముగ్గుర్నీ చూస్తోంది ఓ గుడ్లగూబ.

"ఆగండి" అన్నాడు జనార్దన్. మిగతా ఇద్దరూ ఆగారు. టార్చ్ వెలుతురులో గోధుమ వన్నె త్రాచొకటి చరచరా వెళ్ళిపోతోంది.

"అనవసరంగా వచ్చామేమో" అన్నాడు భానుమూర్తి వెనకనించి.

"వచ్చాక అనవసరం లేదు. అనవసరం లేదు" అన్నాడు చక్రవర్తి.

"అక్కడక్కడా గుంటలూ, ముళ్ళూ వున్నాయి. జాగ్రత్త" అన్నాడు జనార్దన్. సడన్‌గా భానుమూర్తి ఆగాడు. చుట్టూ చూశాడు. టార్చ్ వెలుతుర్లో అన్నివైపులా చెట్లే కనిపించాయి. ఒక్క క్షణం ఒళ్ళుగగుర్పొడిచింది. వేగంగా నడిచి ముందు ఇద్దర్నీ కలుసుకున్నాడు.

"ఇంతకీ శ్రీకాంత్‌గాడు మనల్ని ఇక్కడికి రమ్మని ఎందుకు రాశాడు?" అన్నాడు తను విశ్శబ్దంగా వుండడం ఇష్టంలేక.

"ఏమో" అన్నాడు చక్రవర్తి.




"వాడు రాయడం తప్పుకాదు. మనం ఇలా అతి విధేయంగా రాత్రిపూట రావడం తప్పు."

"అసలు వాడి ఉద్దేశమేమిటో నాకర్థం కాలేదు. ఇక్కడేదో చిన్న అవుట్ హవుస్ ఉందన్నాడు. అసలుందో, లేదో?"

"చూద్దాం నడవండి" అన్నాడు జనార్దన్. ఐదు నిమిషాలు మౌనంగా నడిచారు. భానుమూర్తి విజిల్ వేస్తూ మధ్యలో ఆపేశాడు. అతనికి 'చెక్ చెక్' మనే శబ్దం వినిపించింది. పట్టించుకోకుండా విజిల్ వేయబోయాడు కాని మళ్ళీ అదే శబ్దం.

"ఒరేయ్ మీకేమైనా శబ్దం వినిపించిందా?"

"లేదు."

"నాకు వినిపించింది."

"ఎటువైపునుంచి?"

"వెనకనించి."

"చూద్దాం పదండి"

ముగ్గురూ వెనక్కి తిరిగారు. కొద్దిసేపు టార్చిలు వేసి అటూయిటూ చూశారు. ఏం కనబడలేదు. అలాగే కదలకుండా నిలబడ్డారు. అప్పుడు వినిపించింది మళ్ళీ అదే శబ్దం.

"ఇప్పుడు విన్పించిందా?"

మళ్ళీ కొద్దిసేపు వెతికారు కళ్ళతో.

"ఓస్, దీనికేనా?" అన్నాడు చక్రవర్తి నవ్వుతూ. సగం తెగి నేలకు కొట్టుకుంటున్న కొమ్మని టార్చ్ వెలుతురులో చూపించి. గాలి తగిలినప్పుడు అది శబ్దం చేస్తోంది. అక్కడే నిలబడి మళ్ళీ ఆ శబ్దం ముగ్గురూ మరోసారి విన్న తర్వాత బైల్దేరారు.

"మీకన్నీ వెధవ అనుమానాలురా" అన్నాడు చక్రవర్తి. భానుమూర్తి పెద్దగా నవ్వాడు. మళ్ళీ నిశ్శబ్దంగా నడుస్తున్నారు. వాళ్ళు గమనించలేదుగాని గాలి చల్లబడింది.

"అదుగో బోట్ హౌస్" అన్నాడు చక్రవర్తి, టార్చితో చూపిస్తూ. ముగ్గురూ ఆ ఇల్లు చూసి చాలా సంతోషించారు. గబగబా అటువైపు నడిచారు.

"తాళం వేసుందేమో?"

"ఆ వెధవ అలా రాయలేదు గదా" అన్నాడు చక్రవర్తి.

చిన్న వరండా, ఒకే పెద్ద కిటికీ. తలుపుతోంచి వరండాలోకి వెళ్ళారు ముగ్గురూ. తలుపుమీద టార్చ్ వేశాడు జనార్దన్. చక్రవర్తి గొళ్ళెం తీశాడు. మెల్లిగా నెట్టి తలమాత్రం లోనికి పెట్టిచూసి. లోపలికి వెళ్ళాడు.

టార్చ్ వెలుతురులో ముగ్గురూ గదంతా పరిశీలించారు. ఓ మూల పాతకూజా మూడు రాళ్ళు. విరిగిపోయిన స్టూలు. ఖాళీ విస్కీ సీసాలు రెండు. చిత్తుకాగితాలు వున్నాయి. గచ్చు అక్కడక్కడా పోయింది. గోడలకి సున్నం లేచిపోయింది. అక్కడక్కడా ఇటుక రాళ్ళు కన్పిస్తున్నాయి. ఆ గదంతా అరోచకమైన ముతక వాసన వేస్తోంది.

"ఇందులో ఎవరూ ఉండడంలేదనుకుంటాను" అన్నాడు భానుమూర్తి.

"ఎవరైనా ఉంటే మనం ఎలా వస్తాం?" అన్నాడు చక్రవర్తి. గోడలపైకి టార్చివేసి చూస్తూ. అన్ని వైపులా దుమ్మూ, బూజూ కన్పించింది.

జనార్దన్ తలుపుమూసి వచ్చాడు.

భానుమూర్తి బాగ్‌లోంచి దుప్పటి తీసి పరిచాడు. ముగ్గురూ కూర్చున్నారు.

"సరంజామా అంతా తెచ్చినట్టేనా?"

"అన్నీ తెచ్చాను" అన్నాడు చక్రవర్తి.

రెండు బాగ్‌లు తెరిచి టేప్ రికార్డర్, కాసెట్లు, పళ్ళు, ఆరు బీర్లు, పాకెట్లు, సిగరెట్ పెట్టెలు, అగ్గిపెట్టెలు ప్లేయింగ్ కార్డ్స్ కింద పెట్టాడు. చివరికి కాండిల్స్ తీశాడు. వాటిని ముట్టించి అదే అగ్గిపుల్లతో సిగరెట్ ముట్టించుకున్నాడు జనార్దన్. వెంటనే జేబులోంచి హాండ్ డైరీ తీసి గబగబా రాయడం మొదలెట్టాడు కాండిల్ వెలుతురులో.

"అరె...." అన్నాడు చక్రవర్తి ఆశ్చర్యంగా. మిగతా ఇద్దరూ ఉలిక్కిపడి అతనివైపు చూశారు.

"ఏమిటి?"

"ఉందిలే"

"ఏం ఉంది? ఏం లేదు?"

"ఇదిరా ఓపెనర్: ఇది తెచ్చానో లేదోనని భయపడ్డాను."

"నీ మొహం" అన్నాడు భానుమూర్తి.

"ఆ దిక్కుమాలిన డైరీ ఇప్పుడుకూడా రాయాలా? ఫలానా రోజు ఫలానా శ్రీకాంత్‌గాడు ఇలా ప్రాక్టికల్ జోక్ వేశాడనే

గదా! ఆ విషయం తర్వాత రాసుకోవచ్చు" అన్నాడు చక్రవర్తి.

"మరైతే ఏం చేద్దాం?" అన్నాడు జనార్దన్ డైరీ, బాల్ పెన్నూ పక్కన పడేసి.

"కార్డ్సు ఆడుకోదాం."

చక్రవర్తి కార్డ్సు పంచాడు. సరిగ్గా అప్పుడే వాళ్ళ మధ్య పైనించి ఏదో రాలిపడింది. వేలితో తాకి చూశాడు జనార్దన్.

"రక్తమ్...." అన్నాడు భానుమూర్తి.

"నీ మొహం. నీటిచుక్కరా" చక్రవర్తి దుప్పటిని అవతలికి లాగాడు.

జనార్దన్ లేచి వెళ్ళి తలుపు తీసి చూశాడు. బైట వర్షం పడుతోంది. తలుపేసి వెనక్కి వచ్చాడు. కార్డ్సులో మునిగారు ముగ్గురూ.

"ఇలా సైలెంట్‌గా ఉంటే బోరుకొడుతుంది. రికార్డ్సు విందాం" అన్నాడు భానుమూర్తి. కాసెట్ పెట్టి, రికార్డర్ ఆన్ చేశాడు చక్రవర్తి.

"మంచి పాటలున్నాయా?" అన్నాడు తను మిగతా కేసెట్ల వైపు చూస్తూ.

"ముందు కార్డ్సు చూడు" అన్నాడు జనార్దన్ విసుగ్గా. చక్రవర్తి కార్డ్సు కిందపెట్టి, జేబులోంచి సిగరెట్ తీశాడు. దాంతో పాటే ఓ స్లిప్ వచ్చింది.

కాండిల్ వెలుతురులో ఆ స్లిప్‌ని మళ్ళీ చదివాడు.

"డియర్ ఫ్రెండ్స్,

మీ ముగ్గురూ ఈ రాత్రి రెండు గంటలకు. హైదరాబాద్ రోడ్డులో పదహారో కిలోమీటర్ రాయిదగ్గరున్న తోటలోకి రండి. అక్కడ మీకో అద్భుతం చూపిస్తాను. తప్పకుండా వస్తారు కదూ! వచ్చేటప్పుడు 'సరంజామా'తో రండి. తెల్లారేలోగా మిమ్మల్ని కలుసుకుంటాను.

యువర్స్ సిన్సియర్లీ

—శ్రీకాంత్

"అసలు వీడు చూపించబోయే అద్భుతం ఏమిటి?" అడిగాడు చక్రవర్తి తలపైకెత్తి.

"ఏమో."

"ఏమీ అంతుపట్టకుండా ఉంది."

"వాడికి బుద్ధి రావాలంటే మనం ఇవన్నీ ఖాళీచేయాలి. కుళ్ళి కుళ్ళి ఏడుస్తాడు! లేకపోతే మరోసారి ఇలాంటి జోక్ లేస్తాడు. కార్డ్సు తర్వాత ఆడుకోవచ్చు."

"ఓ కే: ఓ.కే."

జనార్దన్ ఓపెనర్ తీసుకున్నాడు. సరిగ్గా అప్పుడే 'టక్ టక్' మనే శబ్దం వినిపించింది. ముగ్గురూ తలుపువైపు చూశారు.

"శ్రీకాంత్‌గాడే! ముందు ఇవన్నీ దాచేయండి. వాణ్ణి బాగా ఏడిపించొచ్చు" అన్నాడు చక్రవర్తి గుసగుసగా.

"ఓ. కే." సరంజామా బాగ్సులోకి వెళ్ళింది, ఒక్క రికార్డర్ తప్ప.

"పోలీసులేమో?" అన్నాడు భానుమూర్తి.

"కాదు"


"పోనీ....ద .. ద...."

"షటప్! అందుకే పిశాచకథలు చదవొద్దన్నాను".

"రా....డీలేమో."

"వాళ్ళయితే అంత సుతిమెత్తగా. మర్యాదపూర్వకంగా తలుపు తట్టరు" మళ్ళీ టక్ టక్ మనే శబ్దం.

"నేను తలుపు తీస్తాను. మీరిద్దరూ రెడీగా ఉండండి. రౌడీలయితే...."




"సరంజామా ఇచ్చేసి దణ్ణం పెడదాం."

మెల్లిగా తలుపు తీసి. బైటకి చూసి అలాగే నిలబడిపోయాడు చక్రవర్తి.

"ఎవర్రా ?" మెల్లిగా అడిగాడు జనార్దన్.

"అ....అ....మ్మాయి...." అన్నాడు చక్రవర్తి. మిగతా ఇద్దరూ బైటకి తొంగిచూశారు. గుమ్మంలో అమ్మాయి! వాన ఆగిపోయింది కాని. ఆమె చాలాభాగం తడిసి పోయింది. మొహంలో బెదురు స్పష్టంగా కనిపిస్తోంది. ఒక నిమిషం ఎవరూ ఏం మాట్లాడలేదు.

"మీరెవరు?" అడిగారు చక్రవర్తి.

"నే....ను... నా పేరు వసుంధర. కాలేజీలో చదువుకుంటున్నాను. మీరెవరు?" పరిచయం చేసుకున్నారు ముగ్గురూ.

"ఇక్కడికెందు కొచ్చారు?" అన్నాడు భానుమూర్తి.

"లోపలికొచ్చి చెబుతాను" అని లోపలికొచ్చి వెంటనే తలుపేసింది వసుంధర - వాళ్ళు ముగ్గురూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. రెండుక్షణాల్లో ఆగదంతా పర్వేచేసింది వసుంధర.

"రౌడీలు ఆటోలో తీసుకెళ్తుంటే తప్పించుకొనివచ్చాను."

"ఎక్కడ కిడ్నాప్ చేశారు?"

"మెయిన్ బజార్లో"

"ఇంతరాత్రి అక్కడేం చేస్తున్నారు?"

"హాస్పిటల్లో. మా అన్నయ్య దగ్గర్నించి వస్తుంటే ఆపి. బలవంతంగా ఆటో ఎక్కించారు. ఇక్కడికి దగ్గర్లోనే ఆటో బోల్తాకొట్టింది. నేను తప్పించుకొచ్చాను" అని మోచేతికి తగిలిన గాయం చూపించింది వసుంధర.

"మీ బట్టలు తడిసిపట్టున్నాయి" అన్నాడు భానుమూర్తి.

"ఫరవాలేదు. ఈ తోటలో ఇంతరాత్రి వేళ మీరుండడం నా అదృష్టం. లేకపోతే ..." అని నవ్వి కళ్ళు తుడుచుకుంది వసుంధర.

"అవునూ! మీరు పార్టీ చేసుకుంటున్నారా?"

"అబ్బే .. లేదండి" అని బాగ్సు వైపు చూశాడు చక్రవర్తి. బాటిల్సు దాచేసినందుకు తన మేధాశక్తికి తానే గర్వించాడు.

"ఈ రాత్రి ఇక్కడో అద్భుతం చూపిస్తానని మా ఫ్రెండొకడు రాశాడు. అదేమిటో చూద్దామని వచ్చాం. ఆ స్కౌండ్రల్ కోసం ఎదురుచూస్తున్నాం."

"బాగుంది మీ వ్యవహారం" అంది వసుంధర.

"ఆ రౌడీలు ఇక్కడికొస్తారేమో?" అన్నాడు జనార్దన్.

"రారు. వాళ్ళకి బాగా దెబ్బలు తగిలుండొచ్చు. నేను వాళ్ళ

మీద పడ్డాను కనక తగల్లేదు" అంది వసుంధర గోడ పక్కనే కూర్చొని.

భానుమూర్తి కాసెట్ మార్చాడు. వసుంధర గుమ్మంవైపు చూస్తూ కూర్చుంది. చాలాసేపు మౌనంగా కూర్చున్నారు నలుగురూ అనీజీగా.

"టైంమెంతైందండీ" అంది వసుంధర.

"మూడు కావస్తోంది"

"ఇంకా చాలాసేపు కాలక్షేపం చేయాలి."

"అవును."

"మీరేం అనుకోనంటే ఒకటి అడుగుతాను" అంది వసుంధర సిగ్గుతో తలొంచుకొని. భానుమూర్తి చిరునవ్వు నవ్వాడు చక్రవర్తి వైపు చూసి. ఎక్కడో ఏదో మనసులో క్షణకాలం.... క్షణంలో సగం....ఆమె ఆడది.. తాము మగాళ్ళు..........

"ఉదయంనించి నేనేంతిన్లేదు." భానుమూర్తి ఎటో చూశాడు.

"వెరీసారీ.... మేం అసలాగొడవే మర్చిపోయాం" అని చక్రవర్తి బాగ్‌లోంచి పాకెట్లు, పళ్ళు క్రిందపెట్టాడు. "మీరూ తినండి" అంది వసుంధర.

"ముందు మీరు తీసుకోండి." వాళ్ళని అప్పుడప్పుడూ కళ్ళ చివరల నించి చూస్తూ తింది వసుంధర. వాటర్ బాటిల్ అందించాడు భానుమూర్తి.

"మీ ఫ్రెండెప్పుడొస్తాడు?" అంది వసుంధర.

"ఏమో" అన్నాడు చక్రవర్తి. ముగ్గురూ వాటర్ బాటిల్ ఖాళీ చేశారు. భానుమూర్తి సిగరెట్ తీశాడు. కళ్ళతో వద్దన్నట్టు సైగ చేశాడు చక్రవర్తి. సిగరెట్ పాకెట్ జేబులో పెట్టుకుంటూ ఆమెవైపు చూశాడు భానుమూర్తి. ఆమె సరిగ్గా అప్పుడే తల మరోవైపుకు తిప్పింది.

"నాకు నిద్రొస్తోంది" అంది వసుంధర ఆవులించి.

"ఇంకో దుప్పటి వుంది. మీరలా పడుకోండి."

"మీరు చాలా...."

"కష్టంలో అందరం భాగస్వాములం" అన్నాడు జనార్దన్ దుప్పటి అందిస్తూ. దుప్పటి పరుచుకొని, గోడవైపు తిరిగి పడుకుంది వసుంధర. ముగ్గురూ మళ్ళీ కార్డ్స్‌లో పడ్డారు. కొద్దిసేపటికి ఆమె నిద్రపోయినట్టు ఉచ్ఛ్వాస నిశ్వాసలు బరువుగా వినిపించాయి.

"ఇవ్వాళ ఏప్రిల్ ఫస్టా?" హఠాత్తుగా అడిగాడు జనార్దన్.

"కాదు"

"ఇంత ప్రాక్టికల్‌జోకు శ్రీకాంత్‌గాడుఎందుకు వేసినట్టు?"

"మనల్ని ఫూల్స్ చెయ్యాలని. లేకపోతే ఇదంతా ఏమిటి? ఈ పరంజామాతో మనమిక్కడికి రావడం- వాన-ఈ అమ్మాయి, ఈ బోట్ హౌస్, కార్డ్స్, కాండిల్ వెలుతురు ... ది హెల్.... వాడికి రేపు చెబుతాను. మరోసారి ఇలాంటి జోకులెయ్యకుండా" అన్నాడు జనార్దన్ పళ్ళు బిగబట్టి.

"అవును మళ్ళీ జన్మలో .."

"టక్....టక్" తలుపుమీద శబ్దం.

"ఈసారి ఖచ్చితంగా వాడే" అన్నాడు జనార్దన్ తలుపు దగ్గరకెళ్ళి. "రెడీగా ఉండండి. చెయ్యి పట్టుకు లాగుతాను. కళ్ళు మూసేసి కొట్టండి. మరీ గట్టిగా కొట్టకండి. ఏడుస్తాడు పాపం" అని తలుపు తీశాడు జనార్దన్.

బైటికి చూసి ఒక్కగెంతులో వెనక్కి వచ్చేశాడు. ముగ్గురూ అప్పుడు చూశారు, గొడ్డలి పట్టుకుని నిలబడ్డ మనిషిని. అతని చెవులకు రింగులున్నాయి. బనీను, పంచె, కొంచెం మాసిన గడ్డం. నోట్లో చుట్ట....


# తలనొప్పులెన్నెన్నో



# చికిత్స ఒకటి!

# అనాసిన్

## దీన్లో బాధనివారణశక్తి ఎక్కువగా ఉంది

వెంటనే ఉపశమనం యివ్వడం కోసం అనాసిన్‌లో, ప్రపంచమంతటా డాక్టర్లు ఎక్కువగా సిఫార్సు చేసే బాధానివారక ఔషధాలు మరింత ఎక్కువగా ఉన్నాయి.

తలనొప్పి, జలుబు, పడిశెం, ఫ్లూ, నడుం నొప్పి, కండరాల నొప్పి, పంటి నొప్పి, వీటికోసం చాలా బాగా పనిచేస్తుంది.

కేవలం అనాసిన్ పైనే విశ్వాసం ఉంచండి.

ఇప్పుడు సురక్షితమైన ఫాయిల్ ప్యాకింగ్‌లో.




మేనర్స్
అనాసిన్

భారతదేశపు ఎక్కువ జనప్రియమైన నొప్పి నివారించే ఔషధం.

* Licensed user of T.M Geoffrey Manners & Co.Ltd. GM-2-83 TL

"దండాలండి" అన్నాడతను.

"ఎ.... ఎ... ఎవరు నువ్వు!" అడిగాడు భానుమూర్తి.

"నేను కట్టెలకోసం వచ్చానండి. పగటి పూటైతే తంతారు" అన్నాడతను చిన్నగా నవ్వి.

"గ్గొడ్డ....లి... క్కి...ంద.... పెట్టు....మ్ముందు" అన్నాడు భానుమూర్తి.

"అంతలావు నభయపడిపోతారేంటి!" అన్నాడతను అమాయకంగా. గొడ్డలి దించి.

"మేం ఇక్కడున్నామని నీకెలా తెలుసు?"

"పాట ఇనిపిస్తే నూ" అన్నాడతను రికార్డర్ వైపు చూస్తూ.

"ఇంతకీ ఏం కావాలి నీకు".

"నిప్పు".

చక్రవర్తి ఇచ్చిన అగ్గిపెట్టెతో చుట్ట ముట్టించుకొని వరండా దిగి. ఆకాశంలోకి చూసి "మూడు దాటింది టైము" అన్నాడతను. చక్రవర్తి వాచీ చూశాడు. అతను చెప్పిన టైము దాదాపు రైట్.

"ఇట్టా రండి" అన్నాడతను అక్కడే నిలబడి. ముందు జనార్దన్. చక్రవర్తి వెళ్ళారు. ఆ తర్వాత భానుమూర్తి వెళ్ళాడు.

"నేనుఆయేపుంటాను అవసరమైతే పిలవండి" అని తనెటుంటాడో వేలితో చూపించి వెళ్ళాడతను. వాళ్ళు ముగ్గురూ లోపలికి వెళ్ళి తలుపు మూశారు. ఓసారి వసుంధరవైపు చూశాడు భానుమూర్తి.

"ఒరే! హూ డేర్ షి ఈజ్... మనం ముగ్గురం ఉన్నా ఏమాత్రం భయం లేకుండా నిద్రపోతోంది" అన్నాడు భానుమూర్తి మెల్లిగా.

"మనమీద భరోసా. ఆ నమ్మకాన్ని మనం నిలుపుకోవాలి" అన్నాడు జనార్దన్.

"బాటిల్స్ తియ్యనా?" అదే స్థాయిలో ప్రశ్నించాడు భానుమూర్తి.

"నో....నో...మధ్యలో మెలకువ వస్తే బాగుండదు. తాగుబోతు వెధవలనుకుంటుంది."

"ఇక మనం ఆ రాస్కెల్ వచ్చేవరకూ ఏం చేద్దాం?"

"కార్డ్స్ ఆడ్డమే" అన్నాడు చక్రవర్తి సీరసంగా.

"కళ్ళు మండుతున్నాయిరా" అన్నాడు జనార్దన్.

"నాకు వళ్ళు కూడా" అని భానుమూర్తి నవ్వాడు.

జనార్దన్ కార్డ్స్ పంచాడు. పది నిమిషాలు మౌనంగా గడిచాయి.

"ఈ కాసెట్ తీసేసి 'సాగర సంగమం' కాసెట్ పెట్టు" అన్నాడు చక్రవర్తి.

"ఏదీ వద్దు. ఈసారి పాట విని హిట్లర్ బతికి రావొచ్చు మెషిన్‌గన్‌తో."


"ఎవడూ రాడు- ముందా కేసెట్ పెట్టు" భానుమూర్తి అయిష్టంగా కేసెట్ మార్చాడు. పాట మొదలైంది. చక్రవర్తి కార్డ్స్ కిందపడేసి లేచి నిలబడ్డాడు.

"ఇహ ఉండలేన్రా! ఓ సిగరెట్ కాల్చుకొస్తాను" అన్నాడతను.

"పదండి వెళ్దాం" మిగతా ఇద్దరూ లేచారు. తలుపు దగ్గరికి లాగి బైటకి వెళ్ళారు. ముగ్గురూ సిగరెట్లు ముట్టించారు.

"నా కూడా ఓ సిగరెట్ ఇయ్యండి" పక్కనించి వినిపించింది. అతనే గొడ్డలి మనిషి.

"కట్టెలు కొట్టడం అయిపోయిందా!" అన్నాడు చక్రవర్తి సిగరెట్ ఇస్తూ.




"అయిపోయిందండి" సిగరెట్ ముట్టించాడతను.

"అట్టా వస్తారేంటండి!"

"ఎందుకూ?" అన్నాడు భానుమూర్తి.

"కట్టెలమోపు ఎత్తటానికి"

"సరే పద."

అతనికి కట్టెలమోపు ఎత్తి తిరిగొచ్చి ఔట్‌హౌస్ వరండాలో కూలబడ్డారు చక్రవర్తీ. భానుమూర్తీ.

"చాలాదూరం నడిపించాడు.మానవసేవని వెళ్తే" అన్నాడు చక్రవర్తి. నుదుటిమీద చెమట తుడుచుకుంటూ.

జనార్దన్ మాట్లాడకుండా వెళ్ళి తలుపు నెట్టాడు.

"ఒరే! వసుంధర లేదు" అరిచాడతను.

"వెళ్ళిపోయిందా?" ఒక్కఉదుటున లేచారిద్దరూ. ముగ్గురూ గదంతా జాగ్రత్తగా చూశారు. అన్ని వస్తువులూ ఉన్నాయి.

"ఇక్కడో చీటీ ఉంది" అన్నాడు జనార్దన్. అది అతని డైరీలో కాగితమే.

"చదువు చదువు" టార్చ్ తీసివేశాడు భానుమూర్తి. ఆ లెటరంతా వంకరటింకరగా ఉంది.

నమస్తే.

వస్తువులన్నీ సరిగ్గా ఉన్నాయో. లేవోనని చూస్తున్నారు కదూ! నేనేం పట్టుకెళ్ళడంలేదు. మీకు అన్నీ నిజాలు చెప్పాను ఒక్కటి తప్ప. నేను తప్పించుకురావడం రౌడీలు పట్టుకోడం అన్నీ నిజమే. కాని నేను హాస్పిటల్ నించి కాదు వచ్చింది.... ఒక బ్రోతల్ హౌస్ నించి! నేనెవర్నో తెలిసిందికదా.... వేశ్యని. మీకు చెప్పకుండా వెళ్ళాలనే ఉద్దేశంతోనే ఇదంతా రాస్తున్నాను. మీ సంస్కారం నాకు నచ్చింది. ఎవరో తలుపు తడుతున్నారు. మీరైతే పర్వాలేదు.... కాని కంపెనీ రౌడీలయితే....

ఎవరికీ ఏమీకాని
వసుంధర.

"పాపం వసుంధర.... ఐ పిటీ హర్" అన్నాడు భానుమూర్తి. చాలాసేపు ఎవరి ఆలోచనల్లో వాళ్ళు నిశ్శబ్దంగా నిలబడిపోయారు.

"డియర్ రాస్కెల్స్" అని వినిపించింది. ముగ్గురూ ఉలిక్కిపడి గుమ్మంవైపు చూశారు. ఆ మాటలు టేప్ రికార్డర్ లోంచి వస్తున్నాయి. ముగ్గురూ కింద కూర్చున్నారు.

"నా మాటమీద గౌరవం ఉంచి మీ ముగ్గురూ చాలా ప్రయాసపడి ఇంతదూరం వచ్చినందుకు చాలా సంతోషం." ముగ్గురూ శ్రద్ధగా వింటున్నారు.

"నేను ప్రామిస్ చేసినట్లు మీకో అద్భుతం చూపించబోతున్నాను. ఈ పాట అయ్యాక" మాటలు ఆగిపోయి. మరోపాట

మొదలైంది. ముగ్గురూ టెన్షన్‌తో రికార్డర్ వైపుచూస్తూ కూర్చున్నారు.

"ఏమిటా అద్భుతం!" అన్నాడు భానుమూర్తి ఆత్రంగా.

"ష్...." చక్రవర్తి చాలా సీరియస్‌గా చెప్పాడు. పాట అయిపోయింది.

"క్షమించాలి ప్రియమిత్రులారా! అమృతంగురించి మరో పాట విన్నాక చెబుతాను." మరోపాట మొదలైంది.

"వీడు మనతో ఆడుకుంటున్నాడు" అన్నాడు భానుమూర్తి పళ్ళు బిగబట్టి.

"ష్...." అన్నాడు చక్రవర్తి. భానుమూర్తి అతనివైపు విసుగ్గా చూశాడు.

"మేల్ నర్సులకోసం నిన్నో ప్రకటన పడింది చూశావా?" అన్నాడు చక్రవర్తి చెవిలో. చక్రవర్తి నవ్వు బిగపట్టాడు. పాట ఆగిపోయింది.

"ఇప్పుడు అద్భుతం చెప్పేస్తున్నాను. గుమ్మానికి ఎడమ వైపు, అటకమీద హార్లిక్స్ పాకేజ్ పెట్టె ఉంది. ఆ పెట్టెను జాగ్రత్తగా కిందికి దించండి. నేను మళ్ళీ చెప్పేదాకా దాన్ని తెరవకూడదు."

మరో పాట మొదలైంది. వెంటనే ముగ్గురు లేచి నిలబడ్డారు.

"ఇందాక అన్నివైపులా చూశాం కదా" అన్నాడు భానుమూర్తి.

టార్చి వెలుతుర్లో ముగ్గురూ పైనంతా పరిశీలించారు. పెట్టె కనబడింది.

"దాన్నెలా తీసుకురావడం?" అన్నాడు చక్రవర్తి.

"అమ్మో! నేను మాత్రం పైకెక్కలేను" అన్నాడు భానుమూర్తి. పాతకాలపు తలుపుమీంచి దూలం పట్టుకొని పైకెక్కాడు జనార్దన్.

"దీనికి తాడు కట్టేవుంది."

"జాగ్రత్తగా దించు."

ఇద్దరూ ఆ పెట్టెని జాగ్రత్తగా దించి, కిందపెట్టారు. దాని మీద ఓ వైపు 'ఓపెన్' అని రాసివుంది.


భానుమూర్తి ఆ పెట్టెని అటూ ఇటూ ఊపి చూశాడు. కాని లోపల ఏమీ కదలికలేదు. అది అంత బరువుగాకూడా లేదు. జనార్దన్ కిందికి దిగి పాంట్, షర్టూ దులుపుకున్నాడు.


"ఏంవుంది ఇందులో?" అన్నాడతను.

"ఏమో!"

"డబ్బు పెట్లాడేమో!"

"వాడి మొహం. గత రెండు నెలల నుంచి కాఫీ బిల్లు మనమే ఇస్తున్నాం."






"నగ్నసుందరి ఫోటో ఏమో!"

"కాదు. ఆ వెధవ ఇంటివట్టనే పెరిగాడు."

"మనల్ని తిడుతూ రాశాడేమో?"

"ఛఛ...."

"లో పవర్ గ్రెనేడ్ ఉందేమో!"

"నీ మొహం. దీపావళినాడు తలుపు లేసుక్కూచుంటాడు."

"కనీసం పాము...."

"ఉండదు. వాడు ఆబ్సెంటైనా మనమే అటెండెన్స్ పలికాం. నోట్సులిచ్చాం. కల్చరల్ సెక్రటరీగా గెలపించాం. వాడి లవ్ అఫేర్‌లో సాయపడ్డాం. వాడు రాసిన నాలుగుజేళ్ళ కవితల్ని విపరీతంగా పొగిడాం. అదీగాక వాడి తుక్కు కథ అచ్చయినప్పుడు స్వీటు ఇప్పించాం .... శ్రీకాంత్‌కి మన మీద కోపం ఉండదు" అన్నాడు భానుమూర్తి.

"చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నానికదూ! ఆ పెట్టెలో ఏముందా అని?" ముగ్గురూ రికార్డర్ వైపు చూశారు.

"నేను తెరవమని చెప్పబోతున్నాను. ఆగండి.... కాని ఆ మాటని నేనీ కాసెట్లో చెప్పడం లేదు. వెస్టర్న్ మ్యూజిక్ వున్న కాసెట్లో చెబుతాను."

చక్రవర్తి కాసెట్ మార్చాడు. ముగ్గురూ ఆ పెట్టె వైపు, రికార్డర్ వైపు మార్చి మార్చి చూస్తూ కూర్చున్నారు. మ్యూజిక్ జోరుగా సాగుతోంది.

"అసలు వాడిదంతా ఎలా రికార్డ్ చేశాడు!" అన్నాడు చక్రవర్తి.

"సైలెన్స్" అన్నాడు భానుమూర్తి గంభీరంగా.

నిమిషాలు మెల్లగా దొర్లుతున్నాయి.

"అసలీ కాసెట్లో చెబుతాడో, చెప్పడో" అన్నాడు భానుమూర్తి.

"సైలెన్స్" అన్నాడు చక్రవర్తి చాలా గంభీరంగా.

"సారీ ఫ్రెండ్స్. ఇంకో మూడు నిమిషాల్లో ఈ కాసెట్ అయిపోతోంది. హిందీ హిట్ సాంగ్స్ కాసెట్ పెట్టండి" జనార్దన్ కాసెట్ మార్చాడు.

"అసలు మనం ఈ కాసెట్లన్నీ తెస్తామని వాడికెలా తెలుసు!" అన్నాడు జనార్దన్.

"మాట్లాడకు" అన్నాడు భానుమూర్తి.

ముగ్గురూ జాగ్రత్తగా వింటున్నారు.

"మిమ్మల్ని ఇంత కష్టపెడుతున్నందుకు చాలా బాధగా ఉంది నాకు. మీరిప్పుడు ఆ పెట్టెని తెరవొచ్చు. అయితే ఓ షరతు

పై మూత తియ్యగానే పెట్టెని బోర్లించకూడదు. విష్ యు బెస్టాఫ్ లక్."

"వెధవ- అంతా ప్రీ ప్లాన్‌గా చేశాడు" అన్నాడు భానుమూర్తి అక్కసుగా.

"నేను పట్టె తెరుస్తాను" అన్నాడు చక్రవర్తి. పై మూత తీసి చెయ్యి లోపలికి పెటి. బైటికి తీశాడు చిత్తుకాగితాలు. తర్వాత కాగితం ఉండలు. గడ్డి. ప్లాస్టిక్ ముక్కలు. తాడు ముక్కలు. ట్వైన్ దారం. సగం విరిగిన సబ్బు పెట్టెలు. మందు పెట్టెలు. చిన్న గుడ్డ ముక్కలు. కాలెండర్ కాగితాలు....

"ఇదేదో ద్రౌపది చీరెలా ఉందే" అన్నాడు భానుమూర్తి.

"తొందరపడకండి" అన్నాడు చక్రవర్తి.

"తీస్తున్నాను" అన్నాడతను రెండు నిమిషాల తర్వాత.

"ఊఁ త్వరగా" ఊపిరి బిగబట్టారిద్దరూ.

చక్రవర్తి చేతిని బైటికి తీశాడు. అతని చేతిలో కాలికో బౌండ్ పుస్తకం వుంది.

"చివరికి.... చివరికి.... ఇదా వాడు చూపించిన అద్భుతం" అన్నాడు భానుమూర్తి పెద్దగా నవ్వుతూ.

"హార్డ్ జోక్ మరీను" అన్నాడు జనార్దన్. ముగ్గురూ చాలాసేపు నవ్వారు తెరలు తెరలుగా.

"టార్చి ఇలా వెయ్యండ్రా" అన్నాడు చక్రవర్తి నవ్వడం ఆపి. జనార్దన్ టార్చి వేశాడు.

ఆ పుస్తకం మీద గోల్డెన్ లెటర్స్‌లో "ఇండియా" అని వుంది. ఆత్రంగా లోపలి పేజీలు తిప్పాడు. కొద్దిసేపు చూసి జనార్దన్ కిచ్చాడు. అతనూ పేజీలు తిప్పి చూశాడు. మౌనంగా భానుమూర్తి కిచ్చాడు. అతనూ పేజీలన్నీ చూశాడు.

ఆ పేజీల్లో ఒక్క అక్షరం కూడా లేదు. అన్నీ తెల్ల కాగితాలే....


త్వరలో

అనుభవం, జీవితం, మృత్యువు, ఏకాంతం, ప్రేమ, శీలం, దేవుడు.... భయం.... వీటి గురించి పాఠకుల్ని కదిపి కుదిపి ఊపివేసే తాత్విక నవలిక "గతి"

"జ్ఞానపూరితమైన ప్రశాంత జీవితంలో అనుభవాలు మాత్రమే వున్నయ్. వాటి తాలూకు స్పృహ లేదు, జ్ఞాపకాలు లేవు, చరిత్ర లేదు."

"ఈ అవగాహనే నిజమైన స్వేచ్ఛ. ఇదే ప్రశాంతి, మోక్షం. నిర్వాణం. దైవత్వసిద్ధి!"

డాక్టర్ జి. ఆర్. కృష్ణ

ఈ అపూర్వ సత్యాన్ని తెలుగులో నవలారూపంలో ఆవిష్కరింప జేయడానికి చేసిన తొలి ప్రయత్నం ఈ "గతి"

"గతి" చదవడం ఒక తాత్వికానుభవం!



సెప్టెంబరు 20 విడుదల
అన్నీ డైరెక్ట్ నవలలే

డా॥సి.ఆనందారామం- కనువిప్పు రూ. 13/-
చందు సోంబాబు- మరోప్రేమకథ రూ.15/-
ఇంద్రగంటి జానకీబాల- ఆవలితీరం రూ.12/-
ఆరతీమూర్తి- అర్థరాత్రి (హారర్ నవల) రూ.16/-

అక్టోబరు 15 విడుదల
కళాప్రపూర్ణ లత
దెయ్యాలసీత (హారర్ సస్పెన్స్ థ్రిల్లర్) రూ.20/-
చందు సోంబాబు
ప్రేమ ఎందుకు? రూ.15/-
కురుమద్దాలి విజయలక్ష్మి
ఓ జంట కలసిన తరుణాన రూ.15/-
ఆరతీమూర్తి
ప్రేమ కోనమస్కారం! రూ.15/-

★ కేటలాగుకై నేడే వ్రాయండి!
★ అడ్వాన్సుతో ఆర్డర్లు పంపండి వి.పి.పి.లో పుస్తకాలు పంపుతాము

కీర్తి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్, విజయవాడ—520 002



గుడివాడ కాదు ఇప్పుడు విజయవాడలో




కమ్మ కులస్థులు ఇక్కడా అక్కడా అని లేదు.
ఎక్కడున్నా సరే సరైన సంబంధాలు సమకూరుస్తాము.
సంప్రదించండి:

కాకతీయ ఇన్‌ఫర్‌మేషన్ సర్వీస్
లారీ ఓనర్స్ అసోసియేషన్ కళ్యాణ మండపం ఎదురుగా
బెంజి సర్కిల్-విజయవాడ-520006